సువర్చల

సాయంత్రం అయిదుగంట అయింది. నేనూ రాఘవా, కృష్ణుడూ కలసి సుబ్బారావు కోసరం, వాడి ఇంటికి బయల్దేరాము. ప్రతిరోజూ సాయంత్రం అయిదున్నర కల్లా పార్కుకు చేరుకోవటం మా ముగ్గురికీ అలవాటు. ఆవేళ ఆదివారం అవటం మూలాన అయిదు గంటలకే బయల్దేరాము. సుబ్బారావు అరగంట క్రితమే బయల్దేరి వెళ్ళిపోయాడని వాళ్ళ చెల్లాయ్ చెప్పేప్పటికి చాలా ఆశ్చర్యపడ్డాము. ఎందుకంటే రోజూ మేము వచ్చే వరకూ ఖచ్చితంగా ఇంటిదగ్గరే ఉండేవాడు. ఎక్కడికి వెళ్ళాడా అని తర్జన భర్జనలు పడుతూ మేము పార్కుకు చేరుకొన్నాము. తీరా అక్కడికి వెళ్ళేసరికి సుబ్బారావు అప్పటికే అక్కడ మందార చెట్టు ప్రక్కన గడ్డిలో వెల్లకిలా పడుకొని ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ కనబడ్డాడు. మా ముగ్గురికీ పచ్చి ఆశ్చర్యం వేసింది.

"ఏమిట్రా ? ఇవాళ నాలుగున్నరకే బయల్దేరావుట ?" ఆశ్చర్యపోతూ ప్రశ్నించాడు రాఘవ.

ముగ్గురం వాడి ప్రక్కన కూర్చున్నాము.

ఒహ రెండు నిముషాలు శూన్యంలోకీ, ఒక నిముషం మా మొఖాల్లోకి చూసి, ఇంకో నిముషం పూరుకొని అప్పుడు మెల్లిగా అన్నాడు సుబ్బారావు. "నేను ప్రేమించారా !"

మేము ఉలిక్కిపడ్డాము. రాఘవ వెధవమొఖం పెట్టాడు. కృష్ణుడు మాత్రం ఘొల్లున నవ్వేశాడు.

సుబ్బారావుకి కొద్దిగా కోపం వచ్చింది. లేచి కూర్చుని "ఏం ? నేను ప్రేమించకూడదా ?" అంటూ గట్టిగా అరిచాడు. ఇంకొంతసేపు నేమలా పూరుకొంటే వాడు ఘొల్లున ఏడిచేస్తాడని అనిపించింది మాకు.

రాఘవ సముదాయింపుగ అడిగాడు "చూడు సుబ్బారావూ ? నువ్వెవర్నిరా ప్రేమిస్త ?"

సుబ్బారావు మొఖంమీదకి పడిన జుత్తుని వెనక్కి త్రోసుకుంటూ అన్నాడు.

"వెంకట్రామయ్యగారి అమ్మాయి లేదూ ! సువర్చల ! ఆ అమ్మాయినేరా !"

ఈసారి ముగ్గురం తుళ్ళిపడ్డాం ! కారణం అసలు సుబ్బారావు ఇంతవరకూ ఏ ఆడపిల్లవంకా మంచౌని ఒక అరక్షణం గూడా చూసిన పాపాన పోలేదు. వాళ్ళ అటుప్రక్కనుంచే తను ఇటు ప్రక్క ఉండేవాడు. అలాంటివాడు ప్రేమిస్తమేమిటి ? పోనీ ఏదో ప్రేమించాడయ్యా అనుకొంటే అది సువర్చలనా ?

సువర్చల హైస్కూలు తెలుగు మేష్టారు వెంకట్రామయ్యగారి పెద్దమ్మాయి. చిన్నప్పు

సుబ్బారావు

వరకూ చదివింది. సరిగ్గా సంవత్సరం క్రిందటే సువర్చలకి పెళ్ళయింది. పెళ్ళయిన నెల రోజులకే ఆమె భర్త యాక్సిడెంట్‌లో చచ్చిపోయాడు. ఆమె గాజులు చిట్లిపోయినయి. ఆమె నుదుటి కుంకుమ ఆమె పదిహేడవ ఏటే చెరిగిపోయింది. అప్పటి నుండే ఆమె విధవ! సువర్చలని వీడు ప్రేమించటమా?

"ఒరేయ్! నీ కేమన్నా మతి పోలేదుకదా?" కృష్ణుడు సుబ్బారావు వంకే చూస్తూ ప్రశ్నించాడు.

"ఏం? ఎందుకు పోవాలి?" ఎదురు ప్రశ్న వేశాడు సుబ్బారావు.

"ఎందు కేమిట్రా! నువ్వు ఒక విధవావిడని ప్రేమిస్తావా? నీ కసలు బుద్ధుందీ?" విసురుగా అన్నాడు రాఘవ.

సుబ్బారావు లేచి నుంచున్నాడు. కుడిప్రక్కనున్న చెట్టుకొమ్మ గట్టిగా పట్టుకొని సినిమాలో హీరో లాగా పోజిచ్చి గంభీరంగా అన్నాడు.

"హు! విధవ! జీవితమంటే, జీవించటమంటే అర్థం తెలియని అమాయకపు బాలిక విధవా? దేవుడు విధించిన శిక్షకి బాధ్యురాలు సువర్చలా? సంసారం గూడా చెయ్యకుండానే భర్త చనిపోయినందుకు బ్రతికియుండటం సువర్చల చేసిన తప్పిదమా? అట్లయితే ప్రభుత్వము సతీ సహగమనము ఎందుకు రద్దు చేసినట్లు? హు! వెధవ సంఘం!"

వాడితో ఇహ వాదించటం అనవసరమని పూరుకొన్నాడు రాఘవ.

"ఒరేయ్! మీరే చెప్పండ్రా! మనకో చెల్లాయ్ ఉందనుకోండి! మన చెల్లాయే ఆ పరిస్థితిలో ఉంటే మనం ఆమెకి మళ్ళీ పెళ్ళి చెయ్యటానికి ప్రయత్నిస్తామా లేదా?"

మేము ఏమీ మాట్లాడలేకపోయాం! వాడితో కూడా చాలా నిజాయితీ, నిస్స్వార్థత ఉందని అప్పుడే తెలిసింది మాకు.

"అట్లయితే నువ్వు సువర్చలని చేసుకోవడం తప్పదంటావు!" అన్నాను నేను.

"అవునురా! నా జీవితంలో ఒక మంచి పని చేశానని తృప్తిపడతాను. అటుప్రక్క సూర్యుడు ఇటుప్రక్క పొడిచినా, సముద్రాలన్నీ పొంగినా..."

"అవ్వేమీ జరగక్కరలేదు కాని మీ నాన్నకీ సంగతి తెలుస్తే, నాపామిరంగా!" వేళాకోళంగా అన్నాడు కృష్ణుడు.

సువర్చలా-సుబ్బారావు

"ఫరవాలేదు. 'మా నాన్న మాత్రం ఏమి చేస్తాడు ? "ఆస్తి ఇవ్వను పొమ్మంటాడు" అంతేగా ! స్వతంత్రంగా బ్రతకలేనా ? చేతిలో డిగ్రీ ఉంది. వెధవ గుమాస్తాగిరైనా దొరకదా?"

"ఒరేయ్ ! ఇంతకీ నువ్వింత హంగామా చేస్తున్నట్టు ఆ సువర్చల కేమైనా తెలుసా ?" సందేహంగా ప్రశ్నించాడు రాఘవ.

"లేదురా ! తెలియదు. కాని చెబుతాను. ప్రేమ భిక్ష పెట్టమని ప్రార్థిస్తాను. అంగీకరించేట్టు చేసుకొంటాను."

"ఏడిసినట్టే ఉంది ! ఇంతకూ ఈ గొడవేమీ ఆ అమ్మాయికి తెలియదన్నమాట !" చిరాకుగా అన్నాడు కృష్ణుడు.

"ఒరేయ్ ! ఈ విషయంలో మీ రందరూ నాకు సహాయం చెయ్యండ్రా ! సువర్చల దృష్టి నావేపు కెలా మళ్ళించుకోవాలి? అయిడియాలూ, గట్రా అరువివ్వండ్రా !" ప్రాధేయపడ్డాడు సుబ్బారావు.

రాఘవగాడు మంచు ముక్కలాగా కరిగిపోయాడు.

"ఒరేయ్ ! సుబ్బారావూ ! నువ్వింతగా ప్రాధేయపడాలట్రా ! మేము నీకు ఏ విషయంలో సహాయం చెయ్యమన్నామురా ? చెప్పు తన్నా చూడు. నీకూ, సువర్చలకీ తప్పకుండా వివాహం జరిపిస్తాము." అభయహస్త మిచ్చేశాడు రాఘవ. సుబ్బారావు మొఖం చేటంత అయింది. అలాగే సహాయం చేస్తామని నా దగ్గర, కృష్ణుడి దగ్గరా వట్లేయించుకొన్నాడు. అప్పటికే బాగా ప్రొద్దుకూకిపోయింది. అందరం ఇళ్ళకి నడవడం ప్రారంభించాము. నలుగురం చీలిపోయేప్పుడు రాఘవ అన్నాడు : "ఒరేయ్ ! సువర్చల వీణ్ణి లవ్ చెయ్యటానికి అందరం అయిడియాలు ఈ రాత్రికి ఆలోచిద్దాము. ప్రొద్దున్నే నలుగురం కృష్ణుడు గదిలో కలుసుకొని ఒక మంచి ఉపాయం ఆలోచించి అమలుపరుద్దాం !

ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయాం ! నాకు ఆ రాత్రంతా వాడి గురించే ఆలోచన. వాళ్ళ నాన్నకి వా డొక్కడే సుపుత్రుడు. బోలెడంత ఆస్తి ఉంది. వీణ్ణి బందరులో వాళ్ళ బాబాయి దగ్గరుంచి కాలేజీలో చదివించాడు. రెండు, మూడు మార్లు చూసి చివరకి మొన్న సెప్టెంబరులోనే బి. ఏ. కంప్లీటు చేశాడు. ఆపైన ఏమైనా సరే చదవనని వాళ్ళ బాబాయితో చెప్పేశాడు. రాఘవా నేనూ అంతకుముందే బి. ఏ. కంప్లీటు చేసి కలక్టరాఫీసులో గుమాస్తాలుగా చేరిపోయాం. కృష్ణుడు మాత్రం ప్రస్తుతం ఫైనలియర్‌లో ఉన్నాడు. అసలు సుబ్బారావు అంత మంచి కుర్రాడు—మా దృష్టిలో అమాయక చక్రవర్తి—ఇంకోడు లేడని పెద్ద ప్రతీతి. అలాంటివాడు ఇలా ప్రేమించి పెళ్ళి చేసుకొంటా ననడం—అందులోనూ ఒక వితంతువుని—నిజంగా ఆశ్చర్యపడదగ్గ విషయమే. ఏది ఏమైనా మొత్తానికి సుబ్బారావు ప్రేమించాడు. వాడు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవటానికి మే మందరం తోడ్పడటం అనేది మా కనీసపు విధి అని నిర్ణయించుకొన్నాను.

మర్నాడు ప్రొద్దున్న నేను కృష్ణుడు రూముకి వెళ్ళేసరికి అప్పటికే అక్కడికి చేరుకొన్న ముగ్గురూ కనిపించారు. రాఘవ పడక్కుర్చీలో పడుకొని ఆ రూము దూలాల వంకే చూస్తున్నాడు. కృష్ణుడు గంభీరంగా కిటికీలోంచి ఎదురింటి కిటికీ వంకే చూస్తూ సిగరెట్టు తాగేస్తున్నాడు. సుబ్బారావు వీళ్ళిద్దరి వంకా ఆత్రుతగా చూస్తున్నాడు. నా రాక నెవ్వరూ గమనించలేదు కూడా. అయిదు నిమిషాలు గడిచిపోయినయి. ఒక్క అంగుళం కూడా కదలకుండా అలాగే కూర్చుని మెల్లగా అడిగాడు రాఘవ.

"ఒరేయ్ ! సుబ్బారావూ ! సువర్చల నీ దగ్గర మంచి పుస్తకాలు పట్టుకెళుతుం దన్నావుగదూ!"

"అవునురా ! రెండు మూడు రోజుల కోసారి మా చెల్లాయి నడిగి తీసుకెళుతుంది."

"మరి మీ చెల్లాయికా పుస్తకా లెక్కడివి ?"

కొన్ని సంవత్సరాల తరువాత ఇద్దరు స్నేహితులు మళ్ళీ కలుసుకున్నారు.

"మీ ఆవిడ మంచిదేనా" ప్రశ్నించాడు ఒకడు రెండో అతణ్ణి.

"దేవత! అంటే నమ్మ" సమాధానం చెప్పాడు అతడు.

"ఎంత అదృష్టవంతుడివిరా! మా ఆవిడ ఇంకా బ్రతికే ఉన్నది." విలపించాడు మొదటివాడు.

డి. పాండురంగరావు (కర్నూలు)

"నేనే ఫ్రెండ్స్ యూనియన్ నుంచి తెచ్చిస్తుంటాను" అన్నాడు సుబ్బారావు.

"అవునా ! మరి ఏం నవలలు తెచ్చిస్తుంటావ్?

"శరత్‌వి, ప్రేమచంద్‌వి ఎక్కువగా తెచ్చిస్తుంటాను !"

"అదే నీ బుద్ధితక్కువతనం !"

గతుక్కుమన్నాడు సుబ్బారావు. "అదేవిట్రా ?" అంటూ ప్రశ్న కూడా వేసేశాడు.

"అవునురా ! ఒక వితంతువు పిల్లకి, అందులోనూ నువ్వు లవ్ చేసిన పిల్లకి ఇవ్వాల్సిన పుస్తకాలు అవా ? నీ వెధవ చెప్పొడూ అంట ?" కోప్పడ్డాడు రాఘవ.

"మరింకేం ఉన్నయిరా !" విచారంగా అన్నాడు సుబ్బారావు.

"నీ బొంద ! ఏమీ లేకపోవడ మేమిటి ? వితంతు వివాహాలను గురించిన పుస్తకాలు అనేకం ఉన్నాయి. కందుకూరి వీరేశలింగంగారి స్వీయ చరిత్ర ఉదాహరణకి తీసుకో. ఇంకా బోలెడు. కన్యాశుల్కం ఇంకోటి. ఇలా కన్యాశుల్కం లాంటి నవల లన్నీ వెదికి, వితంతు వివాహాల్ని ప్రోత్సహించే సరిక్రొత్త నవల లేవన్నా మార్కెట్టులో కొన్నే కాని, వాటిని సువర్చల కందజేయించు మీ చెల్లి ద్వారా ! ఆ పుస్తకాల ద్వారా ఆమెకు తిరిగి వివాహం చేసుకోవాలని, అలా చేసుకొంటే అది తప్పు కాదనీ అభిప్రాయం కలగాలి. తరువాత నువ్వు మన పేటలో ఉన్న వితంతుశరణాలయంలో మెంబరుగా చేరు. నెలకు పది రూపాయలు చందా పడేస్తే చాలు. నిన్నే అధ్యక్షుడు చేసిపారేస్తారు. ఇంకోపని చెయ్యి. సువర్చల మీ చెల్లాయి కోసం వచ్చినప్పుడల్లా నువ్వు వితంతు వివాహాలగురించి చిన్న లెక్చర్లు—సువర్చల వినేట్లు దంచుతూండు"

సుబ్బారావు బ్రహ్మానందపడిపోయాడు. రాఘవ చెప్పిన విషయాలన్నీ తు. చ. తప్పకుండా పాటిస్తాననిమాట గూడా ఇచ్చేశాడు. సుబ్బారావు అందరికీ కాఫీలు తెప్పించటంతో ఆవేళ మా కార్యక్రమం పూర్తయిపోయింది. మరో రెండు రోజుల వరకూ సుబ్బారావు మాకు కనబడనేలేదు. మూడో రోజు సాయంత్రం మేము పార్కునుంచి ఇంటికి వెళుతూంటే సుబ్బారావు హడావుడిగా అద్దె సైకిలుమీద పోతూ ఎదురుపడ్డాడు. మమ్మల్ని చూసి సైకిలు దిగాడు.

"ఏవిట్రా ! అసలు కనబడటమే మానేశావ్ ?" అంటూ అడిగాను నేను.

"ఏముందిరా ! కొద్దిగా బిజీ ! అన్నట్టు వితంతు శరణాలయంలో మెంబరుగా చేరాను. వచ్చే నెలలోనే దాని తాలూకు ఎలక్షన్స్. అందరూ నన్ను శక్రటరీగా ఉండమంటున్నారురా! ప్రస్తుతం ఆ పనిమీదే తిరుగుతున్నాను. ఇంకో సంగతిరోయ్! మీరు చెప్పినట్టు సువర్చలకి ఆ పుస్తకాలు కొని అందజేయించాను. అప్పు డేమయిందో తెలుసా ! సువర్చలే నా దగ్గర కొచ్చి "ఈ రెండు పుస్తకాలు చాలా బాగున్నాయండి. ఇలాంటివే ఇంకేమైనా ఉంటే ఇవ్వండి ! శరత్ నవలలతో విసుగెత్తింది !" అందిరా !

"గుడ్ ! దారిలో కొస్తూందన్నమాట !" సంతోషపడిపోయాడు రాఘవ.

"వెళ్తారా ! కొద్దిగా పనుంది. రేపు—కాదు—ఎల్లుండి సాయంత్రం పార్కు కొస్తా ! టాటా" అంటూ వుషారుగా వెళ్ళిపోయాడుసుబ్బారావు.

అనుకొన్నట్లే ఆ రెండోరోజు సాయంత్రం పార్కుకు మాకంటె ముందే వచ్చి కూర్చున్నాడు సుబ్బారావు. మనిషి దిగాలుపడి ఉన్నట్టు కూర్చున్నాడు.

"ఏమిట్రా ! అలా ఉన్నావేం ?" అంటూ అడిగాము మేము.

"మా బాబాయి కోప్పడ్డాడు. అన్నాడు తల వంచుకొని.

"ఎందుకూ ?" అన్నాడు రాఘవ ఆశ్చర్యంగా.

"నేను నితంతుశరణాలయంలో కలగజేసుకుంటున్న సంగతి ఆయన కెవరో చెప్పారుట. "హాయిగా ఇంట్లో కూర్చోక నీ కెందుకురా ఆ గొడవలన్నీ ? మరోసారి ఇటువంటి వేషా లెయ్య

పోకు. ఇకనుంచీ అక్కడికి వెళ్ళొద్దని" వార్నింగిచ్చాడురా !"

"అది సరేగాని సువర్చల సంగతి ఏమయింది?"

సువర్చల సంగతడిగేప్పటికి సుబ్బారావు కొద్దిగా తొందరపడ్డాడు.

"వరేయ్ ! సువర్చల నాతో మాట్లాడిందని చెప్పానా ? నిన్న నా గదిలో కూర్చున్నా నేను. మా చెల్లి కాలేజీ నుంచి ఇంకా రాలేదు. మా పిన్ని వంటింట్లో ఉంది. అప్పుడేమో సువర్చల సరాసరి నా గదిలోకి వచ్చేసిందారా' మీ చెల్లి ఏదండీ ?" అంటూ. నేను కొద్దిగా స్టన్ అయి తెప్పరిల్లి "ఇంకా కాలేజీ నుంచి రాలేదూ" అన్నా. వెను తిరిగి వెళ్లిపోబోయింది.

"కూర్చోండి ! ఇప్పుడే వస్తుంది. వచ్చే టైమయింది." అన్నా.

మాట్లాడకుండా అక్కడ కుర్చీలో కూర్చుంది. "నిన్న మీరు తీసుకెళ్లిన పుస్తకం ఎలా ఉంది ?" అన్నారా !

"చాలా బాగుందండి ! కాని అందులోని కొండల రావులాంటి కారెక్టర్‌లు నిజ జీవితంలో ఉండటం అసంభవమేమో అనిపిస్తుంది." అంది.

"భలేవారండీ ! అనేకమంది ఉన్నారు. నాకూ నిజంగా పుస్తకంలోకల్లా ఆ పాత్రే నచ్చింది" అంటూ పుస్తకం చదవకపోయినా కోసేశాను నేను.

"మీకు కూడా వితంతు వివాహాలంటే చాలా ఇష్టమనుకొంటానే ?" అందిరా ! అంతే అక్కణ్ణుంచీ ఒక లెక్చరు దంచేశాను.

"అవునండీ ! దురదృష్టవశాత్తూ వితంతువులకి వివాహాలు జరగాలని కోరేవాళ్లలో నే నొకణ్ణి. వీరేశలింగం మొదలైన మహాపురుషులు వారి జీవితమంతా ధారపోసి ఇటువంటి వివాహాలు చేయటానికి ప్రయత్నించి సఫలీకృతు లయ్యారు. నిజం ఆలోచించి చూడండి. ఎవరికైనా చిన్నప్పుడే భర్త పోయా డనుకోండి. అప్పు డిహ వారి గతేమిటి ? జీవితాంతం వారలా బ్రతకవలసిందేనా ? వారూ మానవులే కదా ! వారికి కూడా అనేక కోరిక లుంటయ్ ! కాని యీ వెధవ సంఘం వారిని దూరంగా త్రోసివేస్తుంది. అప్పుడు వారి గతేమిటి !? అలా బ్రతికి ఉండటం కంటే చావడం మంచిది. అందుకనే వీలైనంతవరకూ వారికి సహాయపడటమే నా జీవిత పరమావధిగా ఎంచుకొన్నాను. నేనూ ఒక వితంతువునే పెళ్లాడతాను. నేనే కాదు. మా శరణాలయంలోని మెంబర్లందరూ అదేపని చేస్తారు. సంఘాన్ని ఎదిరిస్తాము. ఈ విషయంలో తల్లిదండ్రులని కూడా లెక్క చెయ్యము.....క్షమించండి. ఆవేశంలో ఏవేవో మాట్లాడేసినట్లున్నాను."

సువర్చల నవ్వుతూ అంది : "మీలాంటి సహృదయులు ఉండబట్టే సంఘం ఆటలు సాగటంలేదు. నిజంగా మీతో పరిచయం కలగటం నా అదృష్టంగా భావిస్తున్నాను."

"దాన్దేముంది గాని, సువర్చలాదేవిగారూ ! మీరు కూడా వితంతు శరణాలయంలో ఎందుకు చేరగూడదు ?"

"ఏమోనండీ ! అంతమందిలోకి రావాలంటే నాకు ఏమిటోగా ఉంటుంది" అంది సిగ్గుపడుతూ.

"మొదట్లో అలాగే యుంటుంది. ఫరవాలేదు. రేపే చేరండి. అక్కడ మీ యిష్టమొచ్చిన పని నేర్చుకోవచ్చు. అల్లికలు, కుట్టుపని, టైపు ప్రాక్టీసింగ్ ...."

"నిజంగా ఇవన్నీ ఉన్నాయాండీ ?"

"నిజంగా ఏమిటండీ ? ఉన్నవే అనుయితేనూ! రేపే చేరండి. నేను వెళ్ళేప్పుడు మీ యింటకొస్తాను. వెళదాం !" అన్నాను.

"రేపు వద్దులెండి. ఎల్లుండి వస్తాను" అంటూ వెళ్లిపోయింది. అదిరా సంగతి. కాబట్టి మనం రేపు ఆమెని వెంట నిడుకొని మా శరణాలయ ప్రవేశ మొనర్చుచుంటిమి" అన్నాడు సుబ్బారావు సగర్వంగా.

వారం రోజులు గడిచిపోయినయి. సుబ్బారావు ఈ వారం రోజులూ ఏమైపోయాడో ఎవ్వరికీ తెలియలేదు. ముగ్గురం కలిసి వాడి యింటికి బయల్దేరాము. మమ్మల్ని చూసి సంతోషపడిపోయాడు.

"ఇప్పుడు మీ దగ్గరికి నేనే వద్దామనుకొంటున్నారా !" అన్నాడు నవ్వుతూ.

"ఈ వారం రోజుల్నుంచీ క్షణం తీరిక లేదురా! రేపే మా శరణాలయం వార్షికోత్సవం. దానికి ఏర్పాట్లూ అవీ చెయ్యడానికి తల ప్రాణం తోకకి వస్తుందనుకోండి. అన్నట్టు మీ రందరూ రేపు మధ్యాహ్నం మూడున్నర కల్లా అక్కడికి కొచ్చెయ్యండి. ఏవో నాటికలు గూడా ఏర్పాటు చేశాం! నేనేం వేయటంలే దనుకో !"

"వరేయ్ ! అంత గట్టిగా మాట్లాడుతావేంరా! మీ బాబాయి ...." అంటూ ఏదో అనబోయాడు రాఘవ.

సుబ్బారావు ఇళ్లెగిరేట్లు నవ్వాడు. "పిచ్చి నాయనా ! మా బాబాయి ఊళ్లో లేడనీ, మళ్లో వారం దాకా రాడనేగా నే నీ వ్యవహారంలో తిరుగుతోంది ?"



'సరే! ఈ గొడవకేం గాని సువర్చల సంగతేమయింది ?''

సుబ్బారావు హఠాత్తుగా గొంతు తగ్గించి చెప్పటం మొదలెట్టాడు. ''అన్నట్టు మీకు తెలియదనుకొంటా. సువర్చలని ఆరోజే అందులో చేర్పించేశాను. అప్పట్నుంచీ నేనంటే చాలా 'ఇది' గా ఉంటోంది. నాతో చాలా చనువుగా కూడా మాట్లాడుతోంది. రోజూ తప్పనిసరిగా ఆమే, నేనూ శరణాలయంలో ఒక నిమిషంసేపన్నా మాట్లాడుకొంటున్నాము. మొన్న సాయంత్రం ఏమందో తెలుసా ?'' అంటూ ఆశ్చర్యార్థకం ఉపయోగించి మళ్లీ తనే చెప్పుకుపోసాగాడు, సుబ్బారావు. ''తన జీవితం అధోగతిపాలు కాకుండా ఆమెని నేను రక్షించానుట. అందుకని తన యావజ్జీవితమూ ఆమె నాకు కృతజ్ఞురాలై యుంటుందిట.'' అని కాసేపాగి ''ఈ మాటల అర్థం ఏమిటంటారూ ?'' అన్నాడు సుబ్బారావు.

''అది కూడా నువ్వే చెప్పు !'' అన్నాడు కృష్ణుడు వాడి ప్రేమ సఫల మయిపోతోందీ అన్న ఉక్రోశంతో. ఎందుకంటే సువర్చల చాలా అందంగా ఉంటుంది. అటువంటి అందగత్తె సుబ్బారావుగాడికి దక్కుతోందే అని చూసినా డెవడయినా సరే, లోపల్లోపల ఏడవక మానడు. (నాకూ రాఘవాకీ మాత్రం ఆ ఉక్రోషం లేదు. సుబ్బారావు మా ప్రాణ స్నేహితుడు.)

ఇంతలో ఎవరో వచ్చి సుబ్బారావుని పిల్చుకెళ్లిపోయాడు. మే మందరం ఎవరి ఇంటికి వాళ్ళు బయలుదేరాం.

''ఒరేయ్! సుబ్బారావు వాళ్ల నాన్న ఈ పెళ్లికి నప్పుకొంటా డంటావా ?'' అనుమానంగా అడిగాడు కృష్ణుడు.

''ఏమో! ఉన్నది ఒక్కడే కొడుకయ్యె! ఒప్పుకోక దూరం చేసుకొంటాడా !'' అన్నాడు రాఘవ.

మర్నాడు మధ్యాహ్నం మూడున్నరకల్లా ముగ్గురం శరణాలయం దగ్గరికి వెళ్లాం! అక్కడ చాలా కోలాహలంగా ఉంది. స్టేజీ చక్కగా అలంకరించారు. మమ్మల్ని చూడగానే సుబ్బారావు పరుగెత్తుకొంటూ వచ్చి తీసుకెళ్లి మొదటి వరుస కుర్చీల్లో కూర్చోబెట్టాడు. మరి కాసేపటికితో సభ ప్రారంభమైంది. ఎవరో ఒకమ్మాయి ''వందే మాతరం'' పాడింది. సుబ్బారావు మా ప్రక్కనే కూర్చుని ''సువర్చల కూడా వచ్చిందిరా! ఆ వరుసలో నాలుగో కుర్చీ చూడండి!'' అంటూ గొణిగాడు. మేము అటువేపు చూశాము. సువర్చల అక్కడ అప్సరసలాగా కూర్చుంది. ఆభరణా లేవీ లేకపోయినా మిగతావారి కందరికన్నా చాలా అందంగా ఉందామె. అందరూ ఉపన్యాసాలిస్తున్నారు.

''ఒరేయ్! సుబ్బారావ్! నువ్వు కూడా ఒక చిన్న ఉపన్యాసం దంచు. సువర్చల డంగైపోవాలి. నీ వాగ్ధాటి చూసి!'' అన్నాడు రాఘవ నవ్వుతూ.

సుబ్బారావు వెంటనే లేచి స్టేజీ వెనుకకు పరుగెత్తాడు. మరో నిముషంలో మైకులో సుబ్బారావు పేరు వినిపించింది. ''ఇప్పుడు సుబ్బారావు గారు మాట్లాడుతారు.'' వెంటనే సుబ్బారావు చిరునవ్వుతో మైకు ముందు నుంచున్నాడు. వాడింతకుముందు పట్టుమని పదిమందిలో కూడా

సువర్చలా-సుబ్బారావు

మాట్లాడి ఎరగడు. అలాంటివాడు స్టేజిమీద ఎలా మాట్లాడగలడా అని ఆశ్చర్యం వేసింది. సుబ్బారావు మెల్లగా పెదవి విప్పాడు. ''అధ్యక్షా! సోదర సోదరీమణులారా! (రెండుసార్లు దగ్గాడు.) నేడు .... జమీన్ ఇవాళ .... చాలా గొప్ప దినపర్వం .... సారీ, పర్వదినం! (వెనుకనుంచి కేరింతలు.) అసలు వితంతు వివాహాల గురించి ఆలోచించే ముందు మనం .... మనం .... ముందు తెల్సుకోవల్సింది ... దాని అర్థం! వితంతువంటే ఎవరు ? (''వెధవ'' వెనుకనుంచి సమాధానం.) అవును! భర్త లేని స్త్రీ. అప్పు డామె గతేంకావాలి ? (వెనుకనుంచి కేక ''ముండ మొయ్యాలి !'') ''అంతే !

ఆ తరువాత ఎంత వెదకినా సుబ్బారావు మాకు స్టేజీమీద కనబడలేదు. నాటికలు అయిపోయిన తరువాత మా దారిన మేము ఇళ్లకు వెళ్లిపోయాం. తరువాత రెండు రోజుల వరకూ సుబ్బారావు మాకు కనబడలేదు. ఆరోజు రాత్రి నేనూ, రాఘవా మాట్లాడుకొంటూ కృష్ణుడు రూములో కూర్చున్నాము. టైము తొమ్మిదయివుంటుంది సుబ్బారావూ ఉంగారుగా లోపలి కొచ్చాడు. వాడి మొహం పాలిపోయింది.

''ఏవిట్రా! ఇప్పు డొచ్చావ్ ? ఏం జరిగింది?' అంటూ ప్రశ్నించాడు రాఘవ.

''ఇందాక సువర్చల మా యింటి కొచ్చిందిరా !'' అన్నాడు నెమ్మదిగా.

''ఇంత రాత్రిప్పుడా ? ఎందుకు వచ్చినట్టు ?''

''ఎందు కేమిట్రా ? వచ్చి ''అన్నయ్యా నన్నూ రామాన్నీ ఆశీర్వదించు'' అందిరా.

రాఘవ నేనూ కూడా ఉలిక్కిపడ్డాం! ''ఏమిట్రా ? రామం ఎవరూ ?'' కృష్ణుడు అడిగేశాడు.

''వాళ్లింటి ప్రక్కన అద్దె కుంటున్నాడురా! నేను చేయూత యివ్వటం మూలాన్నే తను ఆ నిశ్చయాని కొచ్చిందట. లేకపోతే తను బావితో కప్పలాగా అలాగే జీవించేదట. ఇద్దరూ ఇప్పుడు పది గంటలబండికి బెజవాడ వెళ్తున్నారు. అక్కడ రిజిష్ట్రారాఫీసులో రేపు మారేజీ చేసుకొంటారుట. మొన్న పెద్ద పెద్ద నాయకులందరూ ఇచ్చిన ఉపన్యాసాలు ఆమెకు ధైర్యాన్నిచ్చినయ్యట! పైగా నా ఉపన్యాసమే ఆమెకు ఆ నిర్ణయం కలుగజేసినయ్యట!

నేను అలా సహాయపడ్డందుకు నాకు తనూ ఆ రామంగాడూ జీవితాంతం ఋణపడి ఉంటారుట. అదిరా సంగతి! నా ప్రేమకోసం నేనేడిస్తే చివరికి జరిగిం దిదీ! బండి బయల్దేరటానికి మరో పావుగంట టైముంది. సువర్చలా వాళ్ల నాన్నతో వాళ్ళు పారిపోతున్న సంగతి చెప్పెయ్యనా ?'' ఉక్రోషంగా అరిచాడు సుబ్బారావు.

''పోనీలేరా! సువర్చల కాపోతే ఇంకో అమ్మాయి! నువ్వలా ఉలా అయిపోతావేం ? అయినా వాళ్ల పెళ్లి చెడగొడితే నీకేమొస్తుంది !'' అంటూ ఓదార్చాడు రాఘవ.

కాసేపాగాక ''ఛీ! పాడు శరణాలయం! ఈ... పాడు .... సువర్చల కోసం అక్కడ అడ్డమైన చాకిరీ చేశాను. చచ! బుద్ధి తక్కువయిపోయింది' అనుకొంటూ ఇంటికి వెళ్లిపోయాడు సుబ్బారావు.

''శ్రమ ఒకరిదీ, ఫలితం మరొకరిదీ ?'' అన్నాడు కృష్ణుడు.

* * *

ఆ తరువాత నెలరోజులకల్లా తన పెళ్లి శుభలేఖలు అందరికీ పంచిపెడుతూ కనబడ్డాడు సుబ్బారావు.

కట్నం పాతికవేలుట! పిల్లను తను చూడకుండానే ఒప్పుకొన్నాడుట!

''హరి! సుబ్బారావ్ !'' అనుకొన్నాం మేం ముగ్గురమూనూ. ★